నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

అధికారుల తప్పిదం.. రైతుకు శాపం

- రుణమాఫీ తిరి తిరిగి అలిసిపోయామంటున్న రైతు కుటుంబం
- ఇచ్చేటప్పుడు లేని తప్పు ఇప్పుడెలా వచ్చిందని మనోవేదన

ఆవేదన చెందుతున్న చిన్నరాములు, నీలమ్మ

మూసాపేట, సెప్టెంబర్ 28 : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు చేసిన చిన్న తప్పిదాలే నేడు వారికి మాఫీ వర్తించకపోవడానికి కారణంగా చెప్పొచ్చు. ఇలా ఎందరో కర్షకులు మాఫీ లేక ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో చేసేందుకుగానూ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. కానీ రుణమాఫీ వస్తుందా..? లేదా అనే అపనమ్మకం తోనేఉన్న పలువురు మనోవేదన చెందుతున్నారు. ఈ కోవలోకి మూసాపేట మండలం తుంకినీపూర్‌కు చెందిన పేద రైతు కుటుంబం చేరింది. మ్యాకల చిన్న రాములుకు గ్రామ శివారులో (పట్టా పుస్తకం నెంబర్ టీ01210090047లో 2.20 ఎకరాలు) భూమి ఉన్నది. ఈ భూమిపై సదరు రైతు మూసాపేట ఏపీజీవీబీలో రూ.1.20 లక్షల రుణం తీసుకున్నాడు. వడ్డీతో కలిపి ప్రస్తుతం రూ.1.70 లక్షలకు చేరింది. అలాగే అతడి భార్య మ్యాకల నీలమ్మ పేరుపై ఉన్న గ్రామ శివారులో (పట్టా పుస్తకం నెంబర్ టీ01210090090లో 25 గుంటలు) భూమి ఉండగా.. మూసాపేట ఏపీజీవీబీలో రూ.15 వేలు గతంలోనే లోన్ తీసుకోగా.. మిత్తితో కలిపి మొత్తం రూ.20 వేలకు చేరింది. వీరిద్దరు తీసుకొన్న మొత్తం రూ.1.90 లక్షలు మాత్రమే.. ప్రభుత్వ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని చెబుతున్నా.. ఈ పేద రైతు కుటుంబం అర్హులే.. కానీ అధికారుల తప్పిదంతో వీరికి రుణం నుంచి విముక్తి లభించలేదు. ఆధార్‌కార్డు వచ్చిన తర్వాతే ధరణి పట్టా దాల్ పాస్‌బుక్‌లు వచ్చాయి. అయితే ఆధార్‌లో మ్యాకల చిన్న రాములు అని.. పాస్‌బుక్‌లో మాత్రం మర్రిబాయి చిన్న రాములు అని.. పట్టా పాస్‌బుక్ ఇచ్చారు. అతడి భార్య పేరులో మర్రి బాయి అని ఉండడంతో వారు రుణమాఫీకి అర్హులు కాలేదని అధికారులు తెలిపారు. దీంతో సదరు రైతు కుటుంబం లబోది బోమంటున్నది. అన్నీ వివరాలు చూశాకే బ్యాంకోళ్లు మాకు అప్పు ఇచ్చారని రాములు వాపోయాడు. గతంలో కేసీఆర్ పైసలు పడ్డాయి.. మరి ఇప్పుడెందుకు మాఫీ కాలేదని నిలదీస్తున్నాడు. కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయాయన్నాడు.

'హేతుబద్ధీకరణను నిలిపివేయాలి'

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 28: అశాస్త్రీయమైన సర్దుబాటు జీవో 25ను సవరించడం తోపాటు ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులను వెంటనే నిలిపివేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పాలమూరు కలెక్టరేట్ ఎదుట యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. బదిలీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. జీవో 25ను సవరించిన తర్వాతే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు ఉన్న పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమాల్లో నాయకులు వెంకటేశ్, రవికుమార్, ఆదిత్య, వెంకటేశ్వర్లు, మహమూద్, నారాయణమ్మ, శ్రీశైలం, ఉమాదేవి, కనకమ్మ, శంకర్, ఖాదరయ్య, విజయలక్ష్మి, శివరాజ్, నరేశ్, అజయ్, సంధ్యారాణి, కుర్మయ్య, మద్దిలేటి, వామన్‌కుమార్ ఉన్నారు.

గురుకుల అధ్యాపకుల నిరసన

గద్వాల, సెప్టెంబర్ 28: ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైమ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న తమకు నాలుగు నెలలుగా వెంటనే విడుదల చేయాలని గురుకుల పాఠశాల ఎదుట భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరం జూన్‌లో ప్రారంభం కాగా ఇప్పటి వరకు తమకు వేతనాలు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కనీసం పండుగల ఖర్చు జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందన్నారు. కనీసం తమ పిల్లలకు ఫీజులు కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే జీతాలు విడుదల చేసి తమ ఇబ్బందులను తొలగించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో నాగరాజు, మసూద్, దేవప్ప, మునిస్వామి, వెంకటేశ్, నరేశ్, ఆనందం, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

పూల సింగిడి

పాలమూరు ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ

- ఆడిపాడిన విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు
- మార్మోగిన బతుకమ్మ పాటలు
- ఎంగిలిపూల బతుకమ్మతో పండుగ వాతావరణం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 28 : 'చిత్తూ చిత్తూల బొమ్మ శివునీ ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికేనమ్మా.. ఈ వాడలోనా'..! 'ఏమేమి పువ్వుప్పునే గౌరమ్మా.. ఏమేమి కాయోప్పునే గౌరమ్మా..! తంగేడు పువ్వొప్పునే గౌరమ్మా.. తంగేడి కాయోప్పుడే గౌరమ్మా'.. అంటూ బతుకమ్మ పాటలు మార్మోగాయి. శనివారం మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు, అధ్యాపకులు సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆటపాటలతో హోరెత్తించారు. విద్యార్థినులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు బతుకమ్మలను ఎత్తుకుని డ్యాన్స్‌లు, కోలాటం ఆడారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ సందడితో కళాశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఈ సందర్భంగా పలువురు పండుగ విశిష్టతను వివరించారు. ప్రకృతిని ప్రేమించి పూజించడమే బతుకమ్మ అన్నారు. ప్రపంచంలో అనేక జాతులు ఉన్నా.. ప్రకృతిని ఆరాధించే ఏకైక జాతి తెలంగాణ వాసులే అన్నారు. ఈ పండుగ తెలంగాణ పేరును విశ్వవ్యాప్తం చేయగా.. మధ్యలో కొంత నిరాధరణకు గురైనా తిరిగి బతుకమ్మను ఇంటింటికీ చేర్చిన ఘనత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితదే అన్నారు. ఈ పండుగను తొమ్మిది రోజులు పాలమూరులో విద్యార్థినులు వైభవంగా నిర్వహించనున్నారు.

పాలమూరు ఎన్టీఆర్ కళాశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు

లయ తప్పుతోంది

- యువతలోనే అధికంగా గుండెజబ్బులు
- మద్యపానం, ధూమపానమే కారణం
- కేకులు, కూల్‌డ్రింక్స్, జంక్‌ఫుడ్ డేంజర్
- ఏటేటా పెరుగుతున్న హార్ట్‌ఎటాక్ మృతులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- ప్రభుత్వ దవాఖానల్లో గుండె వైద్యులేరీ..?

సందర్భం: నేడు వరల్డ్ హార్ట్ డే

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 28 : గుండె లయ తప్పితే జీవితమే చేజారిపోతుంది. శరీరానికి ఇంజన్ గుండె. హృదయ స్పందనలు పెరిగినా.. తగ్గినా.. ఏదో సమస్య ఉన్నట్లే. ఎప్పటికప్పుడు మనగుండె ఎలా కొట్టుకుంటుందో తెలుసుకోవాలి. అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మన ఆహారపు అలవాట్లు.. వ్యాయామం మన గుండె పని తీరుకు రక్షణ కవచం. మారుతున్న జీవన విధానంతో రక్తపోటు సమస్య ఎక్కువైంది. ఈ నేపథ్యంలో వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ 1990 నుంచి ప్రతి ఏటా సెప్టెంబర్ 29న ప్రపంచ గుండె దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. గుండె జబ్బులపై అప్రమత్తత, అవగాహన పెంచడమే దీని లక్ష్యం. 2027 నాటికి గుండె జబ్బు మరణాలు 25 శాతం తగ్గించాలనే ఉద్దేశంతో వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ పనిచేస్తోంది. ఈ సందర్భంగా గుండె పదిలం కోసం నిపుణుల సూచనలు, సలహాలతో ప్రత్యేక కథనం.

30 ఏండ్లలోపు వారికే..

ఒకప్పుడు 60 ఏండ్లు పైబడి వారికి మాత్రమే గుండెపోటు వచ్చేది. ఇప్పుడు అలా కాదు. 30 ఏండ్ల వారికీ గుండెజబ్బులు రావడం పరిపాటిగా మారింది. ప్రపంచంలో 1.75 కోట్ల మంది హార్ట్ ఎటాక్‌లతో మరణిస్తే దేశంలో 95 లక్షలకు పైగా గుండె జబ్బు మరణాలు నమోదవుతున్నాయి. ఏటేటా ఈ సంఖ్య పెరుగుతూనే ఉన్నది. మధుమేహం, ఊబకాయం వంటివి గుండె పనితీరుపై ప్రభావం చూపుతాయి. అందుకే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి.

మనిషికి శరీరానికి ఇంజన్ గుండె

వాహనానికి ఇంజన్ ఎంత ముఖ్యమో.. మనిషి శరీరంలో గుండె అంతకన్నా ముఖ్యం. ఇంజన్ చెడిపోతే వాహనం ఎలా మొరాయిస్తుందో.. గుండె చెడిపోతే శరీరం అదుపు తప్పుతుంది. శరీరం కణ సమూహం, కణం జీవం కలిగి ఉండాలంటే ప్రతి అవయవానికి తగినంత ఆక్సిజన్.. పోషక పదార్థాలు (న్యూట్రిన్) సరఫరా నిరంతరం జరుగుతూ ఉండాలి. రక్త నళాల ద్వారా రక్తంతో పాటుగా ఆక్సిజన్ గుండె పంప్ చేస్తుంటే శరీరంలోని అవయవాలన్నింటికీ సరఫరా అవుతుంది. వివిధ అవయవాల్లో చెడురక్తాన్ని సేకరించి గుండె శుద్ధి చేస్తుంది. గుండెకు మూడు నాళాలు ఉంటాయి. వీటి ద్వారానే మొత్తం ప్రక్రియ జరుగుతుంది. మనం నిద్రలో ఉన్న కూడా మన గుండె నిరంతరాయంగా పనిచేస్తది. లబ్‌డబ్ మన ఆరోగ్య రహస్యం. మన గుండె నిమిషానికి 70 నుంచి 80 సార్లు కొట్టుకుంటున్నప్పుడే ఆరోగ్యకరంగా ఉన్నట్లు లెక్క.

ఇదీ పరిస్థితి

జిల్లాలో ఏటేటా గుండె జబ్బు బాధితుల సంఖ్య పెరుగుతోంది. 2018లో గుండె జబ్బులతో ప్రభుత్వ జనరల్ దవాఖానకు ఆధిక సంఖ్యలో క్యూ కడుతున్నారు. అంటే గుండె జబ్బు రోగుల సంఖ్య ఏ స్థాయిలో పెరుగుతుందో గమనించాలి. ఈ సంఖ్య పెరుగుతూనే ఉన్నది. వారిలో 15 శాతం వరకు యువతే ఉన్నారు. మారిన జీవన విధానం, చదువు, ఉద్యోగాల్లో ఒత్తిడి గుండె జబ్బులకు ప్రధాన కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. గుండె నాళాల్లో చెడురక్తం పేరుకుపోవడంతో గుండె జబ్బులు వస్తున్నాయి. దీనికి లైపోప్రోటీన్ ఏ ప్రధానం కారణం అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది యువతలో అధికంగా కనిపిస్తుంది. మారుతున్న జీవన ప్రమాణాలతోనే గుండె లయ తప్పుతోంది. సంప్రదాయ ఆహారానికి దూరమైన మనిషి జంక్‌ఫుడ్‌కు దగ్గరవుతున్నాడు. దీనికి తోడు మద్యం, ధూమపానం అలవాట్లు రోజుకు రోజుకూ పెరుగుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట పట్టణాల్లో గుండె జబ్బుల బాధితులు రోజుకు రోజుకూ పెరుగుతున్నారని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన హెల్త్ బులెటిన్ హెచ్చరించింది.

ఈ పరీక్షలు చేయించుకోవాలి

➡ ఛాతి నొప్పి వస్తే : తప్పనిసరిగా ఈసీజీ చేయించుకోవాలి. గతంలో ఎప్పుడో వచ్చిన గుండెపోటును గుర్తించవచ్చు

➡ 2డీ ఎకో పరీక్ష : గుండె స్పందనల్లోనూ, గుండె కండరాల్లోనూ వచ్చిన మార్పులను తెలుపుతుంది. ఛాతినొప్పి వచ్చినప్పుడు అది గుండె జబ్బుకు కారణమవుతుందా? అనే సంగతి తెలుసుకునేందుకు ఎకో పరీక్ష దోహదం చేస్తుంది.

➡ టీఎంటీ పరీక్ష : ట్రెడ్‌మిల్ అనే పరికరం మీద వేగంగా నడవటం ద్వారా గుండెపై కాస్త ఒత్తిడి కలిగించి చేసే పరీక్ష ఇది. నడక లేదా ఇతర శారీరక శ్రమ సమయంలో గుండె పనితీరును తెలుసుకొనేందుకు ఇది ఉపయోగపడుతుంది.

➡ యాంజియోగ్రామ్ : గుండెపోటు నిర్ధారణకు వైద్యులు యాంజియోగ్రామ్ పరీక్ష చేస్తారు. ఈసీజీ, ఎకో పరీక్షల్లో స్పష్టత కాకపోతే ఈ పరీక్ష అవసరం.

రోగికి గుండె పరీక్ష చేస్తున్న వైద్యులు

ఆరోగ్యంగా లేకపోవడం

ఇటీవల ఫంక్షన్లు, డీజేల వద్ద డ్యాన్స్‌లు చేస్తున్న సమయంలో యువకులు గుండెపోటుతో చనిపోతున్నారు. అలాంటి వారు పూర్తిగా ఆరోగ్యంగా లేకపోవడం, సరైన సమయంలో ఆరోగ్య పరిస్థితి చూసుకోరు. పొగతాగడం, మద్యం సేవించడం, మానసిక ఒత్తిడి పెరిగి జబ్బు పెరుగుతుంది. మా దగ్గరకు వస్తున్న వారిలో చాలా మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్లు గుర్తించాం. రోజుకూ 6 నుంచి 7 గంటల నిద్ర, వ్యాయామం, సరైన ఆహారం, రోజుకు 3, 4 లీటర్ల నీళ్లు తాగడం.. ప్రశాంత మైన జీవనం సాగించాలి.

- డాక్టర్ ప్రణయ్,
గుండె వైద్య నిపుణుడు, మహబూబ్‌నగర్

గుండెపోటుకు కారణాలు

* కొవ్వు అధికంగా ఉండే ఫాస్ట్ ఫుడ్ అధికంగా తినడం
* శరీర వ్యాయామం లేకపోవడం
* పొగతాగడం.. పొగ తాగేవారి పక్కన ఉండటం
* మద్యం సేవించడం
* స్థాయికి మించి ఆలోచనలతో ఒత్తిడికి గురికావడం
* గుట్కాలు నమలడం
* ప్రాథమిక స్థాయిలో లక్షణాలు గుర్తించకపోవడం
* హెచ్‌డీఎల్ కొలస్ట్రాల్ పురుషుల్లో 40, ఆడవాళ్లలో 46 శాతానికి మించి ఉండడం
* ఫాస్టింగ్ ఫుడ్ 102-125 ఎంఈ/డీఎల్ దాటి ఉండటం
* రక్తపోటు, మధుమేహం రావడం.

జాగ్రత్తలు పాటించాలి

* ప్రతిరోజూ కనీసం అరగంట వ్యాయామం చేయాలి.
* పురుషులు 40, మహిళలు 50 తర్వాత గుండె పని తీరును క్రమం తప్పకుండా పరిశీలించుకోవాలి
* ధూమపానం, మద్యపానం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి
* ఉద్యోగపరమైన ఒత్తిడి దరిచేరనీయొద్దు
* రోజుకు 8 గంటల నిద్ర అవసరం, మధ్యాహ్నం నిద్ర గుండె, మెదడు పనితీరును మెరుగు పరుస్తుంది.
* యోగా సాధనతో గుండెపై ఒత్తిడి తగ్గుతుంది.

ఆహారపు అలవాట్లు

➡ సంప్రదాయ ఆహారంతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అధిక జీవన ప్రయాణం సమకూరుతుంది.
➡ పీచు పదార్థాలు అధికంగా ఉండే తృణధాన్యాలు, వేరుశనగ, కూరగాయాలు, పండ్లు తీసుకోవాలి
➡ కొవ్వు ఉండే మాంసం బదులు చేపలు తీసుకోవడం ఉత్తమం
➡ టమాటలో గుండెకు ఆరోగ్యానిచ్చే లైకోపిన్ అనే పోషకం ఉంటుంది
➡ బచ్చలి కూరలాంటి ఆకు కూరలు గుండెకు అదనపు బలాన్నిస్తాయి
➡ సమతుల్య ఆహారం తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు మాంసాహారానికి దూరంగా ఉండాలి
➡ రోజుకు క్రమం తప్పకుండా 4 లీటర్లు మంచినీళ్లు తాగాలి
➡ కాఫీ, టీ అలవాట్లు తగ్గించుకోవడం ఉత్తమం

నేనేం పాపం చేశా..

- వేలం వేసిన భూమిని కొనడం తప్పా..
- నా పొలాన్ని ఇప్పించాలని రైతు వేడుకోలు
- కోఆపరేటీవ్ కార్యాలయానికి తాళం వేసిన వైనం

మానవపాడులో కోఆపరేటీవ్ కార్యాలయానికి తాళం వేస్తున్న రైతు సాయిబాబ

మానవపాడు, సెప్టెంబర్ 28: 'ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిని వేలం వేశారు.. నేను వేలంలో సొంత చేసుకున్నా.. అది నేను చేసిన తప్పా.. రెండేండ్లుగా పొలం నాకు స్వాధీన పర్చకుండా కోఆపరేటీవ్ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు.. నాకు న్యాయం జరిగే వరకు కార్యాలయానికి ఎవరూ రాకూడదు.. నాకు న్యాయం జరగకుంటే అధికారుల పేర్లు చెప్పి కార్యాలయం ఎదుటే ఆత్మహత్య చేసుకుంటా'.. అని ఓ రైతు కోఆపరేటీవ్ కార్యాలయానికి తాళం వేశాడు. వివరాలు ఇలా..

మానవపాడు మండలం పెద్దపోతుల పాడుకు చెందిన చంద్రకాంత్‌రెడ్డి తన సోదరుడు పేరు మీద ఉన్న సర్వేనెంబర్ 75ఏ, 76ఏ 6ను తనఖా పెట్టి ట్రాక్టర్, పండ్ల తోటల రుణాలు పొందాడు. నాటి నిబంధనల మేరకు రుణం చెల్లించకపోవడంతో ట్రాక్టర్‌ను వేలం వేసి కొంత మేరకు రుణానికి జమ చేశారు. మళ్లీ అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి రుణం చెల్లించకపోవడంతో నోటీసులు ఇచ్చి, పేపర్ ప్రకటన ఇచ్చి సదరు భూమిని ప్రభుత్వ నిబంధనల మేరకు వేలం వేస్తున్నట్లు కోఆపరేటీవ్ అధికారులు ప్రకటించారు. 2023 జూన్ 9న స్థానిక కార్యాలయంలో అధికారుల సమక్షంలో వేలం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన రైతు సాయిబాబా వేలంలో ఎకరాకు రూ.12.10 లక్షలకు భూమిని కొనుగోలు చేసి రూ.36.30 లక్షలను జమ చేశాడు. అధికారులు అదే ఏడాది సెప్టెంబర్ 25న భూమిని రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. పొలానికి సంబంధించిన పట్టా పాసుపుస్తకాలు రైతుకు వచ్చాయి. కానీ నాటి ఆ రైతుకు కష్టాలు మొదలయ్యాయి. పొలాన్ని సాగు చేసి విత్తనాలు నాటిన రుణం చెల్లించని రైతు పంటను మూడు సార్లు నాశనం చేశాడు. దీంతో సాయిబాబా పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్సీ, కోఆపరేటీవ్ కార్యాలయం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో శనివారం స్థానిక కోఆపరేటీవ్ కార్యాలయానికి చేరుకున్న రైతు సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా కార్యాలయానికి తాళం వేశాడు. చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, పోలీసులు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. కోఆపరేటీవ్ సిబ్బంది మాకు సంబంధం లేదని చేతులెత్తేశారని.. నాకు ఎవరు న్యాయం చేస్తారని రైతు నిలదీశాడు. నా డబ్బు పోయింది.. పొలం దక్కలేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. సమస్య పరిష్కారమయ్యే వరకు కార్యాలయం తెరవనీయనని, లేకుంటే అందరి సమక్షంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. అయితే అధికారులు మాత్రం మా చేతుల్లో ఏమీ లేదంటూ అక్కడి నుంచి జారుకున్నారు. రైతు మాత్రం కార్యాలయాన్ని తెరవనిచ్చేది లేదని తెగేసి చెప్పాడు.

కారును కంటైనర్‌లో ఎక్కించి పరారీ!

- ఏటీఎం చోరీపై కొనసాగుతున్న దర్యాప్తు
- అంతర్రాష్ట్ర దొంగల పనిగా పోలీసుల అనుమానం

పెబ్బేరు, సెప్టెంబర్ 28: ఈ నెల 21 పెబ్బేరు పట్టణంలో జరిగిన ఎస్‌బీఐ ఏటీఎం చోరీ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. రూ. 17.92 లక్షల నగదును ఎత్తికెళ్లిన ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే పలు పోలీసు బృందాలు దొంగల వేటలో పడ్డాయి. పక్కా ప్రణాళికతో పకడ్బందీగా జరిగిన ఈ చోరీ అంతరాష్ట్ర దొంగల పనే అయిఉంటుందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆ కోణంలోనే వారు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఏటీఎం ను గ్యాస్‌కట్టర్‌తో కత్తిరించిన విధానం, వారు అనుసరించిన పద్ధతులు ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో, తమిళనాడు రాష్ట్రంలో జరిగిన ఏటీఎం దొంగతనాలను పోలీ ఉండటంతో ఆ దిశలో పోలీసులు దృష్టి సారించారు. దొంగలు అత్యంత చాకచక్యంగా వ్యవహరించి తాము వినియోగించిన కారును పోలీసులు పట్టుకొనేందుకు వీలు లేకుండా .. ఓ కంటైనర్‌లోకి ఎక్కించి తరలించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలోనూ ఈ తరహాలోనే ఆ ముఠా పలు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ కోణంలోనే వారు దర్యాప్తు కొనసాగిస్తూ పలు రాష్ట్రాల్లో దొంగల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

పకడ్బందీ ప్రణాళిక..పక్కా వ్యూహంతో..

పెబ్బేరులో ఎస్బీఐకి సంబంధించి రెండు ఏటీఎం కేంద్రాలున్నాయి. ఒకటి సుభాష్ చౌరస్తాలోని బ్యాంక్ భవనం కింది భాగంలో ఉండగా..మరొకటి బస్టాండు ఎదురుగా ఉంది. చోరీ జరిగింది మాత్రం బస్టాండు ఎదురుగా ఉన్న దాంట్లోనే. ప్రధాన రహదారిపైనే ఉన్న ఈ ఏటీఎం కేంద్రాన్ని దోచేందుకు దొంగలు ముందుగా రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. 19వ తేదీన మధ్యాహ్నం బ్యాంకు సిబ్బంది వచ్చి ఏటీఎంలో నగదును జమ చేశారు. అదే రోజు రాత్రి దొంగలు చోరీకి పాల్పడటం గమనార్హం. 20వ తేదీన సాయంత్రం గానీ బ్యాంకు అధికారులకు అనుమానం రాలేదు. దొంగలు కూడా చోరీకి పాల్పడ్డ అనంతరం ఏటీఎం ఉన్నదు కాణం షట్టర్‌ను సగభాగం కిందికి మూసి వెళ్లడం తో..ఖాతాదారులు కూడా అది రిపేరులో ఉందేమోనన్న భావనతో దాని జోలికి వెళ్లలేదు. ఏటీఎం నుంచి ఎలాంటి సంకేతాలు లేకపోవడంతో సాంకేతిక సమస్య వచ్చిందేమోన్న అనుమానంతో బ్యాంకు అధికారులు విషయాన్ని ఏటీఎం నిర్వాహకుల దృష్టికి తెచ్చారు. దీంతో వారి సాంకేతిక బృందం వచ్చి చూడటంతో అప్పుడు గానీ చోరీ ఘటన వెలుగులోకి రాలేదు.

ఆధారాలు ధ్వంసం..కారులో పరారీ..

20వ తేదీ తెల్లవారుజామున 3-4 గంటల మధ్య ఏటీఎం చోరీ జరిగినట్లు సీసీ టీవీ ఫుటేజీల ద్వారా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఓ కారులో నలుగురైదుగురు వ్యక్తులు వచ్చి, కారును ఏటీఎం పక్క సందులో ఆపినట్లు తెలిసింది. ముందుగా వారు ఏటీఎంలోని సీసీ కెమెరాలకు నల్లటి స్ప్రే కొట్టి, వైర్లు కత్తిరించినట్లు తెలుస్తోంది. వెంట తెచ్చుకున్న గ్యాస్‌కట్టర్ సాయంతో ఏటీఎం మిషన్‌ను సునాయసంగా కత్తిరించి అందులోని మొత్తం డబ్బును తస్కరించారు. మిషన్‌ను కత్తిరిస్తున్న సమయంలో వెలువడే నిప్పురవ్వలకు కరెన్సీ నోట్లు కాలిపోకుండా మధ్యలో నీళ్లు పోస్తూ పూర్తిగా కత్తిరించినట్లు అక్కడి ఆనవాళ్లను బట్టి పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అలాగే, సీసీ కెమెరాలకు సంబంధించిన అన్ని పరికరాలను సైతం తమ వెంట తీసుకెళ్లి ఆధారాలు లేకుండా చేశారు.

అరగంటలో తమపని ముగించుకొని వారు తిరిగి తాము వచ్చిన కారు లోనే పరారైనట్లు తెలుస్తోంది. కొంత దూరం వెళ్లాక ముందే ఏర్పాటు చేసుకున్న కంటైనర్‌లోకి కారును ఎక్కించి పోలీసులకు చిక్కేవీలు లేకుండా పలాయనం చిత్తగించినట్లు తెలుస్తోంది.

ఏటీఎంను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు(ఫైల్)